# బేతాళ ప్రశ్న!

బలభద్రపాత్రుని రమణి

ఒక ప్రశ్న మానవుడ్ని గతంలోకి తీసుకెళుతుంది... వర్తమానంలో సంచరింపజేస్తుంది.. భవిష్యత్తుని గురించి వూహించుకుంటుంది. ఏ ప్రశ్నకైనా జవాబులు వెదుక్కోడమే జీవితం! చాలా భారమైన విషయం ఏదో చెప్తాననుకుంటున్నారా.. కాదు! చాలా సింపుల్...



ఒక ఆదివారం.. అన్ని రోజులులాగే మా ఇంట్లోనూ తెల్లవారింది. మంచినీళ్ళతో, పాలవాడితో, పనిమనిషితో, కాఫీ డికాషన్లతో నా అష్టావధానం మొదలయ్యింది.

మా ఆయన చిక్కని వేడి వేడి కాఫీ చప్పరిస్తూ పేపర్ చూస్తూ.. ఆదివారాన్ని అలవాటైన స్టైల్లో ఆనందిస్తున్నారు. ఖాళీకప్పుకోసం వచ్చిన నన్ను చూసి సడెన్‌గా ''ఔను! సన్యాసిరావు కొడుక్కి ఉద్యోగం వచ్చిందా?'' అని అడిగారు.

నాకా సన్యాసిరావు ఎవరో తట్టలేదు.

ఇంటర్ రిజల్ట్స్ వచ్చాయి అని నేను ఫోన్ చేస్తే 'ఓహో! అలాగా..' అని పెట్టేసారు. అంతేకానీ మన వాడు ఇంటరేగా.. ఎంత పర్సెంటేజ్ వచ్చిందీ? అని అడగనైనా లేదు. అలా ఆఫీసు పని తప్ప తలలోకి ఇంకో ఆలోచన రానివ్వని ఈయన ఇంత ఆరాగా, అడుగుతున్నారంటే.. ఎవరో దగ్గర వాళ్లే అయి వుంటారు! గబుక్కున 'ఎవరదీ?' అనేస్తే

'మా బంధువులు నీకు జ్ఞాపకం వుండరు' అని అలిగేస్తారేమోననీ.. కాస్సేపు ఆలోచించాను. ఆయన వైపు ఆ పేరు కల బంధువులు ఎవరూ లేరు. నా వైపూ లేరు.

ఉల్లిపాయలు తరుగుతున్నా, ఉప్మా పోపు వేయిస్తున్నా 'సన్యాసిరావు' అన్న పేరు నా మనసుని తొలిచేస్తూనే వుంది. ఇంక లాభం లేదని అట్ల కాడతో వెళ్ళి ''సన్యాసిరావు అంటే ఎవరండీ'' అన్నాను.

ఆయన పేపర్లోంచి తలెత్తి విసుగ్గా చూసి ''అబ్బా! సన్యాసిరావు తెలీదా?'' అని చిరాకుపడి '' ఇదిగో వాట్ వల్ల మందుల ధరలు పెరుగుతాయట.. అలా అని నీ తలనెప్పి మాత్రలు స్టాక్ కొని పెట్టుకునేవు. ప్రమాదం!'' అన్నారు.

నేను మళ్ళీ నా వంటింట్లోకి వచ్చేసి నా జ్ఞాపకశక్తికి పరీక్ష పెట్టుకున్నాను. అంతగా చిరాకు పడ్డారంటే.. దగ్గరవాడే అయి వుంటాడు. ఆయన చిన్నప్పటినుండీ నాకు తెలుసు కాబట్టి ఒక్కొక్క స్నేహితుడి పేరే గుర్తుకు తెచ్చుకున్నాను. అబ్బే.. సన్యాసిరావు అనే పేరు ఎవరికీ లేదు.

నాకు తెలియకుండా ఈ మధ్య పరిచయం అయ్యాడా. అయితే నన్నెందుకు అడుగుతారూ?

పిల్లల గదిలోకెళ్ళాను. ఆర్కిటెక్చర్ చదువుతున్న పెద్దవాడ్ని ''సన్యాసిరావు ఎవరు'' అని అడిగాను.

వాడు బ్లాంక్‌గా చూసాడు. అప్పుడర్థం అయింది. వాడు ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని జెన్నిఫర్ లోపెజ్ పాటలు వింటున్నాడు. నా పెదవుల కదలిక తప్ప వాడికేం వినిపించలేదు. కంప్యూటర్‌లో వాల్యూం తగ్గించి గొంతు పెంచి అడిగాను

''సన్యాసిరావు కొడుక్కి ఉద్యోగం వచ్చిందా? అని మీ నాన్న అడిగారు. ఎవరా సన్యాసిరావు? మీకు తెలుసా?''

కామిక్స్ చదువుతున్న మా చిన్నవాడు తలెత్తి నవ్వుతూ అన్నాడు ''యూ ఆర్ రైట్... వచ్చిందని చెప్పెయ్''

'' ఎవర్రా ఆ సన్యాసిరావు?'' ఆశ్చర్యంగా అడిగాను.

పెద్దాడు కనుబొమలెత్తి అన్నాడు ''హూ ఈజ్ జాన్‌గాల్ట్? అని ఐయన్ రాంద్ నవల్లో చివరిదాకా అంతా అడుగుతూనే వుంటారు.. జవాబు చిక్కదు. అలాగే కొన్ని ప్రశ్నలకి జవాబులు కష్టం!''


నేను కోపంగా చూసేసరికీ మళ్ళీ వాడే అన్నాడు. ''టాస్ వెయ్యి. బొమ్మ పడితే ఉద్యోగం వచ్చిందని చెప్పు. బొరుసు పడితే రాలేదని చెప్పు''

ఎంత ఈజీగా తీసుకుంటున్నారు తండ్రి ప్రశ్నని ఈ తరం పిల్లలూ? రేపు మిమ్మల్ని పెద్ద వయసులో చూసుకోవడం కూడా టాస్ వేసే తేల్చుకుంటారా? ఈయన భేతాళ ప్రశ్నలకి బేఫికర్ జవాబులు వాళ్ళే ఇవ్వగలరు.

చిరాగ్గా అక్కడినుండి వచ్చేసాను.

ఉప్మా ప్లేటుతో మళ్ళీ శ్రీవారి దగ్గరికి వెళ్ళాను.

''ఢిల్లీనుండి ఆవిడ వచ్చినప్పుడు నువ్వు వెళ్ళావా?'' మా వారు ఉప్మా ప్లేటు అందుకుంటూ ఇంకో క్విజ్ పెట్టారు. 'ఢిల్లీనుండా?..' ఢిల్లీలో వుండే బంధువులు కానీ స్నేహితులు కానీ ఎవరైనా మాకు




ఉన్నారా అని మరోసారి ఆలోచించాకా..

''ఢిల్లీనుండి ఎవరొచ్చారూ? నేను ఎక్కడికి వెళ్ళలీ?'' అడిగాను.

ఆయన మొహం చాలా సీరియస్‌గా వుంది. స్పూన్‌తో ఉప్మాలో జీడిపప్పు కోసం అన్వేషిస్తున్నారు.

''అదే రమణీ! ఆరోజు నువ్వు టీవీ స్టేషన్ నుండి అటునుండే వస్తావనీ టెన్షన్ పడ్డాను. పెరేడ్ గ్రౌండ్స్‌లో మీటింగ్ కదా! ట్రాఫిక్ జామ్‌లో చిక్కున్నావా?'' అన్నారు.

''ఆవిడ అంటే సోనియా గాంధీనా?'' ఆశ్చర్యంగా అడిగాను.

''ఆ!'' ఆయన మొహంలో నాకు అర్థం అయినందుకు ఆనందం కనిపించింది.

''మరి నా తోడికోడలి గురించో.. మీ బావమరిది పెళ్ళాం గురించో అడిగినట్లు అడిగారూ? నాకేం అర్థం అవుతుంది?'' చిరాకు పడ్డాను.

''సాఫ్ట్‌వేర్ రంగం అంతా క్రైసిస్‌లో వుంది. ఈ ఆర్టికల్ చదివావా?'' నా మొహం ముందు పేపర్ పెట్టారు.

అంటే ఆయన మళ్ళీ తన ప్రపంచంలోకి వెళ్ళిపోయారన్నమాట. నేను సన్యాసిరావు అనే కేరక్టర్ గురించి మళ్ళీ బుర్ర పాడు చేసుకుంటూ కూర్చున్నాను. ఒక వేళ ఇతనూ సోనియాగాంధీ అంత పాపులర్ ఫిగరా? న్యూస్ ఛానెల్స్‌లోకూడా ఆ పేరు ఎక్కడా వినలేదే? అయినా అంత చనువుగా 'వాళ్ళ అబ్బాయి ఉద్యోగం విషయం ఎందుకు అడుగుతారూ?' అయి వుండదు!

నా మేధస్సుని చక్రాలు చక్రాలుగా తిప్పుకుంటూ.. కవ్వంతో మజ్జిగ చిలికినట్లు చిలికి ఫ్లాష్ బ్యాక్‌లోకి వెళ్ళాను. ఒక మనిషి ఒక రూపం పొగమంచులో కనపడినట్లు తటిల్లున కనపడీ కనపడక మాయం అయింది. నేను వదలలేదు. చివరికంటా ఆ దారాన్ని పట్టుకుని వెళ్ళాను. ఎన్నెన్నో మధుర స్మృతులు బయటపడ్డాయి.

నేను డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న రోజులు. పద్దెనిమిదేళ్ళకే ఈ మహానుభావుడితో ప్రేమలో పడి, అటు వాళ్ళూ, ఇటు వీళ్ళూ మా పెళ్ళికి ఒప్పుకోకపోవడంతో నలిగిపోతున్న రోజులు.


గిరిజా మేడం ఎకనామిక్స్ క్లాసులో కోయిలలా పాఠం చెప్తోంది. బయటి మా కస్తూరిబా కాలేజీలో చెట్లమీద పక్షులు లయబద్ధంగా అరుస్తున్నాయి. నేను సడెన్‌గా పక్కనున్న మా ఉమ జబ్బ మీద గిల్లాను.

''అబ్బా... పాడు నల్లులు!'' అంది.

''నల్లికాదు నేనే గిల్లాను'' అన్నాను.

''ఎందుకూ?'' గుసగుసలాడింది.

''సమస్య వచ్చింది.. నాకు అర్జెంటుగా ఇల్లు కావాలి''




''నీకా?'' ఎగాదిగా చూసింది.

''రిజిస్టర్ ఆఫీసులో ప్రభూ నేను వన్‌మంత్ నోటీస్ ఇచ్చాం. పసుపు బట్టలతో వెళ్తే హారతిచ్చి ఎవరూ లోపలికి రమ్మనేటట్లు లేరు. అందుకే ముందుగా ఇల్లు చూసి పెట్టుకుంటే మంచిదనీ...''

''చూద్దాంలే'' ఇంటర్వెల్‌లో సెనగలు కొందాంలే అన్నట్లు తీసిపారేసింది.

''చూద్దాం కాదు. ఈరోజే వెతకాలి'' అన్నాను.

''ఎక్కడ వెతకాలీ? మా ఇంటి దగ్గరా?''

''ఊహూ! నాలుగు గంటలకి లోకల్‌కి మల్కాజిగిరీ వెళ్దాం. దయానందనగర్ స్టేషన్ పక్కన వెతుకుదాం'' చెప్పాను.

''అక్కడ నీకెవరైనా తెలిసిన వాళ్ళున్నారా?'' ఆశ్చర్యంగా అడిగింది.

''కాదు! అక్కడ రైల్వే స్టేషన్ వుంది. రోజూ రైలెక్కి కాలేజీకి రావచ్చు. చిన్నప్పటినుండీ నాకు రైలంటే సరదా''

నేను చెప్పిన కారణం దానికి డైజెస్ట్ అవలేదని, దాని మొహం చూస్తుంటే నాకు అర్థమై పోయింది.

''అదీగాక మా చిక్కడపల్లి లాంటి ఏరియాలో అద్దెలు మేం భరించలేం. ప్రభుకొచ్చే దాంట్లో వాళ్ళ వాళ్ళకి కొంత ఇవ్వాలి. నన్ను చదివించాలి. ఆ తర్వాత ఇంటద్దే, మా తిండీ, బట్టలూ.. అన్నీ గడవాలి!'' దిగులుగా అన్నాను.

''వారానికి మూడు సినిమాలు తెలుగూ, హిందీ, ఇంగ్లీషూ అనే భాషాభేదం లేకుండా చూస్తూ.. చిక్కడపల్లి సుధా హోటల్లో మసాలా దోశ తినే మనకి.. ఈ కష్టాలు అవసరమంటావా?'' బాధగా అడిగింది.

''ప్రభు కావాలిగా'' నిక్కచ్చిగా చెప్పాను.

ప్రేమ మొండిది.. తుమ్మబంక లాంటిది. టీవీ సీరియల్ లాంటిది!

''సర్లే! అలాగే వెళ్దాం''అంది.

క్లాసంతా ఇంత నిశ్శబ్దంగా వుందేవిటా అని చూస్తే మేడంతో పాటు అందరూ మా సంభాషణే వింటున్నారు. మా గిరిజా మేడం మనసు వెన్న లాంటిది. సెగ తగిలితేనే కరిగిపోతుంది. అందుకే జాలిగా చూసి పరిస్థితిని అర్థం చేసుకుంది. అదే పబ్లిక్ ఎడ్మినిస్ట్రేషన్ సూర్యకాంతం మేడం అయితే.. మేం క్లాసు బయట వుండేవాళ్ళం. ఇది శుభసూచకంగా అనిపించి వెంటనే బయల్దేరి వెళ్ళి రైలు పట్టుకున్నాం.

''మీ ఇంటికొస్తే రైల్లో బటానీలు కొనుక్కు తినచ్చు'' అని ఉమ బోలెడు సరదా పడిపోయింది.

ఒక మధ్యతరగతి ఇంట్లో మిషన్ కుడ్తున్న పెద్దావిడ్ని కిటికీ లోంచి చూసి '' ఏవండీ! మీ ఇంట్లో పోర్షన్ ఏదైనా ఖాళీగా వుందా? అద్దెకి కావాలి'' అని అడిగింది ఉమ.

అప్పటికే ఇరవై ఇళ్ళల్లో అడిగి అడిగి మంచి ప్రొఫెషనలిజం వచ్చేసినట్లుంది.

ఆవిడ కాలేజీ నుండి పుస్తకాలతో వచ్చిన గొట్టికాయల్లాంటి మమ్మల్ని విచిత్రంగా చూసి '' ఆ వుంది'' అని లేచింది.

మూడు గదుల పోర్షన్. ముచ్చటగా వుంది.

''ఎంతమందుంటారూ?'' ఆవిడ అడిగింది.

'' ఇద్దరం..'' చెప్పాను.

''నువ్వు ఈ అమ్మాయీనా?''

''కాదు.. నేనూ మా ప్రభూ!''

''ప్రభు ఎవరూ?''

''మా అన్నయ్య ఫ్రెండ్''

ఈ జవాబుకి ఆవిడ షాక్ తింది.

పరిస్థితిని అదుపులోకి తీసుకు రావడానికి మా ఉమ కలగజేసుకోవలసి వచ్చింది.

''ప్రభుని అది పెళ్ళి చేసుకోబోతోంది.

''ఎప్పుడూ?'' ఆవిడ అనుమానంగా అడిగింది.

''మీరు ఇల్లిచ్చాకే'' అదే మా సమస్య అన్నట్లు చెప్పింది ఉమ.

''అది కాదండీ.. మరీ..'' అని నేను మొత్తం పూసగుచ్చినట్లు వివరించాను. ఆవిడకీ నా ఈడు కూతురు కొత్తగా పెళ్ళయి అత్తారింట్లో వుందిట. ఆవిడ నాలో ఆ అమ్మాయిని వెదుక్కుని కళ్ళనీళ్ళు పెట్టుకుంది. ''సరేనమ్మా. అద్దె నూట డెబ్బై ఐదు రూపాయలు. కరెంట్ ఎక్స్‌ట్రా'' అంది.

ఆ 'కరెంట్ ఎక్స్‌ట్రా' అన్న పాయింట్ దగ్గర అసెంబ్లీ సమావేశాల్లా మా ఇద్దరికీ చాలా తర్జన భర్జనలు జరిగాయి. ఉమ స్పీకర్‌లా ఏ స్థాయీ భావం కల్పించకుండా వుండడానికి విశ్వప్రయత్నం చేసింది. చివరికి ఆవిడే దిగొచ్చింది.

''మీరు ఏవట్లూ?'' అప్పుడావిడ కులం అడిగింది.

చెప్పాను.

''అయ్యో! మీకు మడీ ఆచారం వుంటాయి. మరి మేం...'' ఆవిడకూడా చెప్పింది.

''ఆ మాట అనకండి. అదలా ముంగిలా కనిపిస్తుంది కానీ, మనసులో చాలా భావాలున్నాయి. మైక్ ఇస్తే విరక్కొడుతుంది. దానికి దగ్గర కులం గిలం జాన్తానై'' అని ఉమ ఆవేశపడింది.

ఆవిడ కష్టమ్మీద సమాధానపడింది. ఆ ఇంటి యజమాని అప్పలస్వామిగారు.. ఆవిడ నరసమ్మ. ఆ ఇంట్లో రెండేళ్లు వున్నాం. మా మధ్య ఆ టాపిక్ రాలేదు. ఆవిడా ఆయనా నన్ను కన్నబిడ్డల్లాగే చూసారు.

''మీ ఆయన్ని చూసి ఫారెనర్ అనుకుంటున్నారంతా!'' అని ఆవిడ మురిపెంగా చెప్పేది.

''బావి దగ్గరికి షర్ట్ లేకుండా వెళ్ళద్దని చెప్పు. అల్లుడికి దిష్టి తగుల్తుంది'' అనేది.

మా పెళ్ళికి కూడా వాళ్ళొచ్చారు. ఆ ఇంట్లో వాళ్ళతో బాటుగా ఆవిడ తమ్ముడు ఒకడు వుండేవాడు. అతని పేరు సన్యాసిరావు. అప్పటికే ఒక కొడుకు. గోళీకాయలా వుండేవాడు.

నా స్మృతి పథంలో ఆ పేరు తగలగానే నవ్వొకున్నాను. ఆ సన్యాసిరావు ఈ మధ్య పరిషత్తుల్లో రెండు మూడు సార్లు మేకప్‌మేన్‌గా నాకు కనిపించి ఈయన గురించి అడిగాడు.. అయినా అంతగా మా ఆయన గుర్తుపెట్టుకోవాల్సిన ఫీల్డు కాదే. శాపూ, కంప్ తప్ప ఈయనకి పట్టవే.

''ఛీ..ఛీఛీ'' అని నా జ్ఞాపకశక్తికి విసుక్కున్నాను.

''ఈ రింగ్‌టోన్ పెట్టుకో సెల్‌కి. ఎక్కడ 'ఛీ..ఛీఛీ' అని వినిపించినా నాకు నువ్వే గుర్తొస్తావు!'' మా ఆయన పేపర్ పక్కన పడేసి జోకారు.

ఈమధ్య మా మిత్రుడొకడు ''నేను ట్రాఫిక్‌లో వున్నా. జర అయినంక మాట్లాడ్తా'' అనే రింగ్‌టోన్ పెట్టాడు. నేను ఫోన్ చేసినప్పుడల్లా ఇలా చెప్పడం, నేను ఫీలయి పెట్టేయడం రెండు మూడుసార్లు జరిగాకా, ఇంటికి ఫోన్ చేసి వాళ్ళావిడ్ని '' ఎప్పుడూ ట్రాఫిక్‌లో ఏం చేస్తున్నాడూ మీ ఆయనా?'' అని అడిగా.

ఆ అమ్మాయి ముసి ముసిగా నవ్వి, ''అది రింగ్ టోన్ అండీ'' అంది.

మా అత్తగారు నాకు సెల్‌ఫోనొచ్చిన కొత్తల్లో '' ఎప్పుడు ఫోన్ చేసినా కొంచెం సేపు ఆగి ట్రై చెయ్యమంటావేమిటే?'' అని చిరాకు పడ్డారు. అది రికార్డెడ్ ఇన్‌ఫర్మేషన్ అని ఆవిడకి తెలియలేదు.

మొత్తానికి నేను సన్యాసిరావుని పట్టేసాను.

''మీకా అప్పలస్వామిగారి బావమరిది సన్యా

సిరావు ఇప్పుడెందుకు గుర్తొచ్చాడూ?'' ఆశ్చర్యంగా అడిగాను.

ఆయన విచిత్రంగా చూసి ''అతనెవరు?'' అన్నారు.

''ఇందాకా అడిగారుగా'' అరిచాను.

''అదా... ఎదురింటాయన గురించి'' తాపీగా చెప్పాడు.

''ఎదురింట్లో సన్యాసిరావు ఎవరండీ?''

''ఆయన పేరు వి.ఎస్ రావుగా!''

''అంటే వి.శేషగిరిరావు!''

''అలాగా.. వైజాగ్ ప్రాంతం వాళ్ళేగా.. సన్యాసిరావు అనుకున్నాను'' తేలిగ్గా అనేసారు.

నా ఇరవై ఏళ్ళ గతం సినిమా రీలులా తిప్పుకుని గంటనుండీ ఎంత ప్రయాసపడ్డానో ఆయనకు అరిచి అరిచి చెప్పాను.

అంతా విని చిన్నగా నవ్వి '' ఆ రోజులు బావుండేవి. అప్పులస్వామి గారింట్లో'' అన్నారు.

''అప్పలస్వామి'' దిద్దాను.

ఈ కథ ఇక్కడితో ముగిస్తే సుఖాంతం అయ్యేది. కానీ.. నా చేతి గాజులు సవరిస్తూ మా ఆయన ''ఆరోజుల్లో ఎంత బావుండేదానివీ?'' అన్నారు.

నేను ఆయన చేతిని విసురుగా తోసేసి వంటింట్లోకి వెళ్ళిపోయాను. అయోమయంగా చూసారు. పాపం ఎందుకో అర్థం అయివుండదు!

అప్పుడు బావున్నానంటే.. అర్థం ఏవిటీ? మరి కోపం రాదూ!

★



## కలిసిరాని కాలం

అశోకాలో షారూక్‌ఖాన్ పక్కన మెరుపులా మెరిసిన హృషితాభట్ తరువాత మసకబారిపోయింది. హీలోయిన్ రోల్స్ నుంచి గెస్ట్ పాత్రలకి జారిపోయింది. 'కిస్నా, పేజ్-3' సినిమాల్లో చిట్టిపొట్టి వేషాలేసింది. అదేమిటంటే సుభాష్ ఘయ్ మాట కాదనలేక ఒప్పుకున్నానని అంటోంది. 'ఫ్రెండ్స్ ఫరెవర్' అనే సినిమాలో హీరోయిన్ వేషం వచ్చినప్పటికీ ఆ సినిమా ఆగిపోవడం హృషితా దురదృష్టం. సుభాష్‌ఘాయ్ తన సినిమాలో హీరోయిన్ వేషం ఇస్తానని ప్రామిస్ చేశాడు కానీ... కిస్నా ఫ్లాప్ దెబ్బకి ఆయనింకా కోలుకోలేదు.